గణేశ్ ఉత్సవాలపైనా వివక్షేనా..?

- పరిషత్‌లో మండిపడ్డ చలవాది
- ముగిసిన శాసనసభ కార్యకలాపాలు
- తొమ్మిదిరోజులు సాగిన సభ
- అర్ధరాత్రి 12దాకా.. ఇదే రికార్డు



శాసనసభలో సీఎం సిద్దరామయ్య


పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణ స్వామి

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గణేశ్ ఉత్సవాలపైనా వివక్షేనా అంటూ పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. శుక్రవారం పరిషత్‌లో మాట్లాడుతూ రాష్ట్రానికి ఒకే చట్టం ఉండాలని, హిందువులు వినాయకచవితి ఉత్సవాలను సంతోషంగా ఆచరిస్తారన్నారు. ప్రభుత్వం అవకాశం కల్పించాలన్నారు. హిందువులు జరుపుకొనే వేడుకలకు ఆంక్షలు సరికాదన్నారు. గణేశ్ ఉత్సవాలు మౌనంగా జరపాలనేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయమన్నారు. దక్షిణకన్నడలో హిందువులపై కట్టడి చేసేలా కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. కులవర్గీకరణ రిజర్వేషన్లపై సమగ్ర చర్చ లేకుండానే జరిపారన్నారు. నాగమోహన్‌దాస్ కమిటీ, సదాశివకమిషన్, మాదుస్వామి నివేదికలను పాటించలేదని, సుప్రీంకోర్టు ప్రస్తావనలు లేవన్నారు. మూడు గ్రూపులుగా మారిన సంచారజాతులు రోడ్డెక్కారన్నారు. ఇటువంటి అంశాలపై చర్చకు అవకాశం ఇవ్వకుండానే దాటవేశారన్నారు.

పొన్నణ్ణ చెప్పేదాకా తెలియదు - సీఎం

ఆర్సీబీ విజయోత్సవాల వేళ తొక్కిసలాటపై ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశంపై 69వ నిబంధన కింద చర్చ జరిగింది. ప్రతిపక్షనేత అశోక్, సునిల్ కుమార్, సురేశ్‌కుమార్ సహా పలువురు సభ్యులు గురువారం మాట్లాడారు. ఈ అంశంపై డీసీఎం డీకే శివకుమార్ కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం సభలో సీఎం సిద్దరామయ్య వివరణ ఇచ్చారు. ఆర్సీబీ జట్టు గెలుపొందడం రాష్ట్రంలోని క్రికెట్ అభిమానులందరికీ సంతోషం ఇచ్చిందన్నారు. ఇదే సందర్భంలోనూ మ్యాచ్ జరిగిన మరుసటిరోజు జూన్ 4న విజయోత్సవాలు జరిగాయన్నారు. విధానసౌధ ప్రాంగణంలో ప్రభుత్వం తరఫున క్రికెటర్లకు సన్మానంలో పాల్గొన్నా అన్నారు. అప్పటికే లక్షలాదిమంది ఇటు విధానసౌధ, అటు చిన్నస్వామి స్టేడియం వద్ద చేరారన్నారు. ఇక్కడ సన్మానం జరుగుతుండగానే న్యాయసలహాదారుడు పొన్నణ్ణ స్టేడియంవద్ద తొక్కిసలాట జరిగిందని పలువురు మృతి చెందారని సమాచారం ఇచ్చారన్నారు. తప్పు చేసినవారిని వెనకేసుకొచ్చేది లేదన్నారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లానన్నారు. మృతదేహాలు చూస్తే హృదయం కలిచివేసిందన్నారు. ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నవారు అర్ధాంతరంగా మృతి చెందారన్నారు. ఇందులో నేనేం దాచేది లేదన్నారు. ముందురోజే నా మనవడు లండన్ నుంచి వచ్చాడని, క్రికెటర్లంటే అభిమానం ఉన్నందునే నాతో కలసి వేదికపై వచ్చాడన్నారు. తప్పు జరిగినందుకే మెజిస్టీరియల్ దర్యాప్తు చేయించామని, పోలీస్ అధికారులను సస్పెండ్ చేశామన్నారు. ఆర్సీబీ కర్ణాటక టీం కాదని, నేను సభకు వచ్చేది లేదని తెలిపానన్నారు. అయితే 18ఏళ్ల తర్వాత జట్టు గెలిచిందనే ఉద్దేశ్యంతో అందరి కోరిక మేరకు వచ్చానన్నారు.


పరిషత్ సభాపతి హొరట్టి

దేవెగౌడ నిన్ను సస్పెండ్ చేశారు - సీఎంను ఉద్దేశించి యత్నాళ్

కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులకు సంబంధించిన అంశంపై చర్చ జరుగుతుండగా గత ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణల అంశం ప్రస్తావనకు వచ్చింది. బాదామిలో బాగానే పంచారట కదా..? అంటూ బసనగౌడ పాటిల్‌యత్నాళ్ మాట్లాడారు. అందుకు సీఎం నిన్ను పార్టీనుంచి సస్పెండ్ చేశారు కూర్చో అంటూ వ్యాఖ్యానించారు. అందుకు యత్నాళ్ బదులిస్తూ మిమ్మల్ని కూడా దేవెగౌడ జేడీఎస్ నుంచి సస్పెండ్ చేశారన్నారు.

ఎన్నెన్నో గమ్మత్తు వ్యాఖ్యలు

తొమ్మిదిరోజుల శాసనసభ సమావేశాలలో ఎన్నెన్నో గమ్మత్తు వ్యాఖ్యలు హల్‌చల్ చేశాయి. గ్రేటర్ బెంగళూరు సవరణ బిల్లు చర్చకు వచ్చినప్పుడు గ్రేటర్ అనే ఇంగ్లిష్‌పదాన్ని ఎందుకు వాడారంటూ ప్రతిపక్షనేత అశోక్ మండిపడ్డారు. కాంగ్రెస్ నేత రాజీవ్‌గాంధీ తీసుకొచ్చిన 73, 74 సవరణలకు ఇది వ్యతిరేకం కాదా అని అభ్యంతరం వ్యక్తం చేశారు. అందుకు డీకే శివకుమార్ జిల్లా పంచాయతీ సభ్యుడిగా రాజకీయాలు ప్రారంభించానని, 45ఏళ్లలో పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ చేశానన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలు అధికార వికేంద్రీకరణ అన్నారు. ఇదే సందర్భంలోనే బీజేపీ సభ్యుడు సురేశ్ కుమార్ మాట్లాడుతూ పొలిటికల్ సైన్స్‌లో ఎన్ని మార్కులు తెచ్చుకున్నారో గానీ రాజకీయాల్లో వందకు రెండొందలు మార్కులు తెచ్చుకున్నారన్నారు.

మేం అడ్జస్ట్‌మెంట్ ప్రతిపక్ష సభ్యులం

బీజేపీ నుంచి వివిధ కారణాలతో సస్పెన్షన్‌కు గురైన యత్నాళ్, శివరాం హెబ్బార్, ఎస్‌టీ సోమశేఖర్ ఉన్నారు. వారికి శాసనసభలో 224 నుంచి 226దాకా సీట్లు కేటాయించారు. ఇదే విషయమై యత్నాళ్ మాట్లాడుతూ అధ్యక్షా రాష్ట్రంలో 224 శాసనసభ స్థానాలు మాత్రమే ఉన్నాయి. నా సీటు 224 సరిపోయింది. కానీ వారిద్దరికీ 225, 226 ఎలా కేటాయిస్తారు. అసలు అంతమంది ఎమ్మెల్యేలు లేరన్నారు. గాలి జనార్ధనరెడ్డి పార్టీ విలీనం చేసేందుకు ముందు వరుసలో ఉన్నారు. మేం ఆరేడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచినవారం మాకూ ముందే ఉండాలన్నారు. మేం అడ్జస్ట్‌మెంట్ ప్రతిపక్ష సభ్యులమన్నారు.

పరిషత్‌లో బాగల్కోటె చక్కెర ఫ్యాక్టరీకి సంబంధించి ప్రస్తావనలు 'కబ్బు సచివరు' అంటూ బీజేపీ సభ్యుడు రవికుమార్ ప్రస్తావించారు. అందుకు సభాపతి బసవరాజహొరట్టి కబ్బు అంటే చెరుకు అని, కొబ్బు అంటే కొవ్వు అని మీరు ఏ అర్థంతో మాట్లాడారో చెబితే బాగుంటుందన్నారు. ఆయన చక్కెరలాంటి తీపిమంత్రి అన్నారు. పరిషత్‌లో ప్రశ్నోత్తరాల వేళ కాంగ్రెస్ సభ్యుడు శరణగౌడ బయ్యాపుర మాట్లాడుతూ ముదిగల్ పట్టణానికి తాగునీరు ఇస్తే మీ ఫోటో పెట్టుకుని పాలాభిషేకం చేసి పూజలు చేస్తామన్నారు. నగరపాలకశాఖ మంత్రి భైరతి సురేశ్ జోక్యం చేసుకుని అధ్యక్షా నా ఫోటో పూజంటూ అన్నారు... నా కూతురు పెళ్లి చేయాల్సి ఉంది.. అప్పుడే ఇలాంటి మాటలా అన్నారు.

సభాపతికి ప్రత్యేక అభినందనలు

పరిషత్ సభ్యుడిగా 45ఏళ్లపాటు కొనసాగిన సభాపతి బసవరాజ హొరట్టికి పరిషత్‌లో గురువారం సభ్యులంతా ప్రత్యేకంగా అభినందించారు. బహుశా దేశంలో ఒకేస్థానం నుంచి 45ఏళ్లపాటు పరిషత్ సభ్యుడిగా ఎవరూ ఉండరని అభిప్రాయపడ్డారు.

9 రోజులు.. 54 గంటలు

9రోజులపాటు సాగిన శాసనసభ కలాపాలలో 54 గంటలపాటు పరిషత్‌లో కార్యకలాపాలు కొనసాగాయి. 20న బుధవారం రాత్రి 12 గంటలదాకా పరిషత్‌లో కలాపాలు కొనసాగడంపై సభాపతి, సీఎం, మంత్రులు, సభ్యులకు ప్రత్యేకంగా అభినందించారు. చివరిరోజు శుక్రవారం పరిషత్‌లో గణేశ ఉత్సవాలలో రాత్రి 10 గంటల తర్వాత డీజే ఉపయోగించరాదనే ప్రభుత్వ నిర్ణయంపై బీజేపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. జిల్లాలవారీగా అధికారులు పరిస్థితులను బట్టి సడలిస్తారని సభానాయకుడు బోసరాజు తెలిపారు.


పరిషత్‌లో మంత్రి కృష్ణబైరేగౌడ


శాసనసభలో ప్రతిపక్షనేత అశోక్


బీజేపీ సభ్యుడు సురేశ్‌కుమార్

బాను ముస్తాక్ చేతుల మీదుగా
మైసూరు దసరా ఉత్సవాలు



బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాలు దేశంలోనే ఎక్కడాజరగని రీతిలో నిర్వహిస్తారు. అందుకు ప్రత్యేకమైన విధి విధానాలు ఉన్నాయి. ఏటా ఓ సాహితీవేత్త లేదా ప్రముఖుల ద్వారా ఉత్సవాలను ప్రారంభించే సంప్రదాయం ఉంది. ఈ ఏడాది దసరా ఉత్సవాలను ప్రముఖ రచయిత్రి, బుకర్‌ప్రైజ్ విజేత బానుముస్తాక్ ప్రారంభించనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. బానుముస్తాక్ రచించిన హృదయదీప రచనకు బుకర్‌ప్రైజ్ లభించిన విషయం తెలిసిందే. సెప్టెంబరు 22నుంచి అక్టోబరు 2దాకా 11రోజులపాటు మైసూరులో దసరా ఉత్సవాలు జరగనున్నాయి. దసరా ఉత్సవాలు మైసూరులో రెండు ప్రత్యేక విధి విధానాలతో జరుగుతాయి. ప్రారంభం రోజున ప్రత్యేక ఆహ్వానితులతోపాటు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, అధికారులు పాల్గొంటారు. చాముండేశ్వరిదేవికి పుష్పార్చన ద్వారా శ్రీకారం చుట్టే ఉత్సవాలలో ప్రతిరోజూ సాహిత్య, సాంస్కృతిక, నృత్య కళాప్రదర్శనలు ఉంటాయి. జంబూసవారి రోజున 750 కేజీల బంగారు అంబారిపై చాముండేశ్వరిదేవిని ప్రతిష్ఠించి ఊరేగిస్తారు. పూల ప్రదర్శన, వస్తు ప్రదర్శనతోపాటు మైసూరు నగరమంతటా ప్రత్యేకమైన విద్యుద్దీపాల అలంకరణలు ఉంటాయి. ఎయిర్‌షో, హెలిటూరిజం వంటి కార్యక్రమాలన్నీ ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగుతాయి. మరోవైపు రాజ సంప్రదాయంలో భాగంగా మైసూరుప్యాలెస్‌లో యువరాజు యదువీర్ బంగారు సింహాసనంపై ఆసీనులై ప్రైవేట్ దర్బార్ నిర్వహిస్తారు. జంబూసవారి పూజ ప్యాలెస్‌లో ప్రత్యేకంగా జరుగుతుంది.

విధులకు అడ్డంకి... గిరీశ్ మట్టణ్ణపై ఎఫ్ఐఆర్

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ వివాదంలో మహేశ్‌శెట్టి తిమరోడిని అరెస్టు చేసేందుకు వెళ్లిన పోలీసుల విధులకు అడ్డంకి కలిగించడం, బెదరించిన మేరకు గిరీశ్‌మట్టణ్ణవర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గురువారం బ్రహ్మావర పోలీసులు బెళ్తంగడిలో మహేశ్‌శెట్టిని అరెస్టు చేసేందుకు వెళ్లిన సమయంలో గిరీశ్, జయంత్‌లతోపాటు పలువురు అడ్డుకున్నారు. మహేశ్‌శెట్టిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తుండగా సుమారు 10 కార్లలో వెంబడించారు. వీటిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ధర్మస్థళ వివాదాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జాతీయ మానవహక్కుల రాష్ట్రపరిషత్ అధ్యక్షులు సంపత్‌కుమార్, వెంకటేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉజిరెలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం కొనసాగించకుండా త్వరితగతిన సమస్యను తేల్చాలని డిమాండ్ చేశారు.

సుజాతభట్ చెప్పిందంతా నిజమనుకున్నాం: జయంత్

ధర్మస్థళ వివాదంలో సంచలనం అనిపించేలా సుజాతభట్ చెప్పిందంతా నిజమని నమ్మామని వ్యతిరేకవర్గంలోని జయంత్ అభిప్రాయపడ్డారు. మంగళూరులో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మెడికో విద్యార్థి అనన్యభట్ కూతురని, ధర్మస్థళలో తప్పిపోయారని రెండు దశాబ్దాలుగా సుజాతభట్ చెప్పడంతో నమ్మామన్నారు. ఇప్పటివరకు అనన్యభట్‌కు సంబంధించి ఎటువంటి వివరాలు అందించకపోవడంతో ఆమెపై అనుమానాలు వస్తున్నాయన్నారు. మరోవైపు యూట్యూబర్ మహ్మద్ సమీర్‌కు అండగా నిలిచిన కంటెంట్ క్రియేటర్‌లు యూటర్న్ తీసుకున్నారు. దీపక్, మధు, తేజస్‌గౌడ ఇప్పటివరకు సమీర్‌కు అండగా ఉంటామని చెప్పుకొన్నారు. యుద్ధం చేసేందుకు వెళ్లినప్పుడు సైనికులను లెక్కపెడతారా..? అంటూ కామెంట్ చేశారు. కానీ సమీర్‌పై కేసు నమోదు కావడం, ముందస్తు బెయిల్ దక్కిన తర్వాత వారంతా యూటర్న్ తీసుకున్నట్టు తెలుస్తోంది.

ధర్మస్థలపై అనవసర ఆరోపణలు తగవు: బీజేపీ



8

షరతులులేని రుణాలు మంజూరు చేయాలి

- రైతు సంఘం డిమాండ్

ముళబాగిలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రుణాలను సకాలంలో చెల్లించిన రైతుకూలీలు, స్త్రీ శక్తిసంఘాలకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలను మళ్లీ మంజూరు చేయాలని రైతుసంఘం డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రమైన కోలారులోని డీసీసీ బ్యాంకు కార్యాలయం వద్ద మడకలతో నిరసన తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ మాట్లాడుతూ లక్షలాదిమంది రైతు కూలీలు, మహిళలు ప్రైవేట్ ఫైనాన్స్‌దారుల మీటరువడ్డీ దందాలో చిక్కుకుంటున్నారన్నారు. ఇటువంటివారికి ఉపశమనం కల్పించేలా తక్కువవడ్డీతో రూ.1 లక్ష నుంచి రూ.10లక్షల దాకా వ్యవసాయ, స్త్రీశక్తిసంఘాలకు రుణాలను ఇచ్చే జిల్లా సహకారబ్యాంకుకు త్వరలోనే అధ్యక్షులు, పాలకవర్గాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. స్వాభిమానంతో జీవనానికి వీలు కల్పించేలా డీసీసీ బ్యాంకు నుంచి రుణాలు పొందినవారు తిరిగి సకాలంలో చెల్లించినవారు ఉన్నారని, అటువంటి వారికి మళ్లీ రుణాలు మంజూరు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇందులోనూ ఏమైన రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా..? లేదా ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలతో కుమ్మక్కు చెందారా..? అని ప్రశ్నించారు. రైతుసంఘం మహిళా జిల్లాఅధ్యక్షురాలు నళినిగౌడ మాట్లాడుతూ ముంగారు వర్షాల అవాంతరాలతో లక్షలాది రూపాయల ఖర్చుతో వేసిన పంటలు నీరుపాలయ్యాయన్నారు. మార్కెట్‌లో మంచిధర ఉన్నా తోటల్లోనూ పంట నీటమునిగి నాశనమైందని విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో బ్యాంకులనుంచి తీసుకున్న అప్పులను ఎలాగోలా చెల్లించినా, తిరిగి రుణాలు మంజూరు చేయడానికి ఎందుకు నిర్లక్ష్యమన్నారు. వినతిపత్రం స్వీకరించిన అనంతరం మేనేజర్ మాట్లాడుతూ రైతు కూలీలు, స్త్రీశక్తిసంఘాలకు త్వరలోనే మళ్లీ రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. నిరసనలో రైతుసంఘాలకు చెందిన ఈకంబళ్లి మంజునాథ్, మరగల్ శ్రీనివాస్, ఆంజినప్ప, గిరీశ్, వెంకటేశప్ప, కుప్పణ్ణ, నరసింహప్ప, నారాయణగౌడ తదితరులు పాల్గొన్నారు.


డీసీసీ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేత


గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సుస్మిత

మౌలిక సదుపాయాల కోసం విద్యార్థిని ధర్నా

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తాను చదువుకుంటున్న పాఠశాలకు సరైన రోడ్డు లేదని, గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని నిరసిస్తూ సుస్మిత అనే విద్యార్థిని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాకు కూర్చుంది. దావణగెర జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు కుర్చీకి గాంధీజీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసుకుని కూర్చుంది. గ్రామ ప్రజలు విద్యార్థినిని చూసి అవాక్కయ్యారు. గ్రామ పంచాయతీ అధికారి ధర్నా చేస్తున్న బాలిక వద్దకు చేరుకుని ధర్నాను విరమించాలని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. బాలిక ససేమిరా అనడంతో చేసేది లేక మధ్యాహ్నం సమయానికి గ్రామంలో డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీసేందుకు సిబ్బంది దిగడంతో ధర్నా చేపట్టిన బాలిక విరమించుకుంది. బాలిక గ్రామంలో నెలకొన్న సమస్యలను గమనించి ధర్నాకు పూనుకోవడంతో ప్రజలు విద్యార్థినిని అభినందించారు.

ధర్మవ్యతిరేకులపై చర్యలకు డిమాండ్

- ధర్మస్థలకు కార్ల ర్యాలీ


ర్యాలీకి బయల్దేరుతున్న బీజేపీ బృందం

శిడ్లఘట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మవ్యతిరేకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీకల్‌రామచంద్రగౌడ డిమాండ్ చేశారు. ధర్మస్థళకు కార్లతో ర్యాలీగా బయల్దేరిన వేళ ఆయన మీడియాతో మాట్లాడారు. ధర్మం విషయంలో తప్పు చేసినవారిపై వెంటనే శిక్ష విధించాలని, రెండుమూడు రోజుల్లో తీర్మానం తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ తీవ్రపోరాటం చేస్తుందన్నారు. యూట్యూబర్ సమీర్ అంశాన్ని ప్రస్తావిస్తూ అతడిపై అన్ని చోట్లా ఫిర్యాదులు వస్తున్నాయని, తప్పుడు ఫోటోలతో ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేశారన్నారు. చిక్కబళ్లాపుర జిల్లా నుంచి సుమారు 250కుపైగా కార్లలో వేలాదిమంది ధర్మస్థళను రక్షించేందుకు ధర్మస్థళకు వెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, బాగేపల్లి మునిరాజు, తాలూకా మాజీ అధ్యక్షుడు సురేంద్రగౌడ, శిడ్లఘట్ట తాలూకా అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ సిందూర్ అమర వీరులకు నివాళులు


అలరించిన
సాంస్కృతిక ప్రదర్శనలు

బొమ్మనహళ్ళి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో శ్రీనివాసకల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. 16ఏళ్లుగా క్రమం తప్పకుండా ఇక్కడి కమిటీ నిర్వాహకులు ఏటా శ్రీనివాసకల్యాణం నిర్వహిస్తున్నారు. సప్తగిరి భజనమండలి, వెంకటాద్రి, గరుడాద్రి, శేషాద్రి తదతర భజనమండలుల ఆధ్వర్యంలో భరతనాట్య సుధాకళాశాల, దేవిశక్తి బృందం, నిసర్గ మహిళామండలి తదితర బృందాలచే సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను అలరించాయి. ప్రదర్శనలో భాగంగా ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన సైనికులకు నివాళులు అర్పించే రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శనివారం ఉదయం అభిషేకం, పూజల అనంతరం భజనలు, శ్రీనివాసకల్యాణోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు, తిరుమల లడ్డూ పంపిణీతోపాటు అన్నదానం జరగనుంది.


యువతుల నృత్య ప్రదర్శన

భార్య, బిడ్డ లేని జీవితం ఎందుకని..

వృద్ధుడి ఆత్మహత్య


అంజినప్ప (ఫైల్)

గోరంట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎండాల బండ వీధికి చెందిన బొక్కసం అంజినప్ప (68) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని వానవోలు రహదారిలో పెట్లగుండపల్లి సమీపంలోని పొలంలో చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. చెట్టుకు వేలాడుతున్న అంజినప్ప మృతదేహాన్ని పశువుల కాపర్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి రెండో కుమారుడు శ్రీనివాసులు (32) అనారోగ్యంతో ఈఏడాది ఫిబ్రవరి 10న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడి మృతితో కుంగిపోయిన అంజినప్ప భార్య సాకమ్మ (63) అతడి సమాధి వద్దే మార్చి 10న యాసిడ్ తాగింది. ఆమె బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మార్చి 22న మృతి చెందారు. నెల రోజుల వ్యవధిలోనే కుమారుడు, భార్య మృతి చెందడాన్ని అంజినప్ప జీర్ణించుకోలేకపోయాడు. మానసికంగా తీవ్ర వేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థలం అమ్మి భార్య చికిత్స కోసం చేసిన అప్పులు చెల్లించాడు. కుమారుడు మృతితో వితంతువైన కోడలు పేరున ఇంటిని రాశాడు. అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి పెళ్లైన కుమారుడు ఒకరు, పెళ్లి కావాల్సిన కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం


స్వప్న

బొమ్మనహాళ్, ఆగస్టు22, (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై బొమ్మనహాళ్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు కర్ణాటక రాష్ట్రంలోని మొలకాల్మూర్ తాలుకా రాంపురం గ్రామానికి చెందిన స్వప్న (14) బొమ్మనహాళ్‌లో నెల రోజుల కిందట తప్పిపోయినట్లు ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. రాంపురానికి చెందిన లమ్మని సంతోష్ కుటుంబ సభ్యులతో నెల రోజుల కిందట బొమ్మనహాళ్‌కు కొలిమి పనులకోసం వచ్చారు. గత నెల 23న స్వప్న బహిర్భూమికి వెళ్లి వస్తాను అని చెప్పి తిరిగి రాలేదన్నారు. వివిధ ప్రాంతాల్లో గాలించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శీనప్ప (ఫైల్)

కూడేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శివరాంపేట గ్రామానికి చెందిన రైతు బోయ శీనప్ప(35) అప్పుల బాధతో ఉరి వేసుకున్నాడు. శీనప్పకు రెండెకరాల పొలం ఉంది. దీనికితోడు నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని కంది, ఆముదం, పప్పుశనగ పంటలను సాగు చేసి నష్టపోయాడు. రూ.5 లక్షలకు పైగా అప్పులు పేరుకుపోయాయి. దిక్కుతోచని స్థితిలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లిన భార్య అరుణజ్యోతి తిరిగి వచ్చేసరికి మృతిచెందాడు. ఇరుగుపొరుగు సాయంతో మృతదేహాన్ని కిందకు దించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతు దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు విన్నవించారు.

ప్రేమ పెళ్లికి నిరాకరించారని

యువకుడి ఆత్మహత్య


గుణ(ఫైల్)

బత్తలపల్లి, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవంపల్లికి చెందిన యువకుడు గుణ (20) ప్రేమ పెళ్లికి బంధువులు నిరాకరించారన్న మనస్తాపంతో శుక్రవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాఘవంపల్లికి చెందిన నరసింహుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు గుణ పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దే వ్యవసాయం చేసుకుంటుండేవాడు. బంధువుల అమ్మాయిని ప్రేమించాడు. విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించలేదు. దీంతో గుణ మనస్తాపం చెందాడు. తోటలోనే వారి ఇల్లు ఉండేది. శుక్రవారం రాత్రి ఇంటి ఆవరణలో పడుకున్న గుణ తోటలోని మామిడి చెట్టుకు ఉరేసుకుని, మరణించాడు. ఉదయం అతడు కనిపించకపోవడంతో కుటుంబీకులు తోటలో వెతకగా.. మామిడి చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుణ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణ.. ఓ కుట్ర

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్


మాట్లాడుతున్న రత్నాకర్

అనంతపురం టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ.. కులాల మధ్య చిచ్చుపెట్టే కుట్ర అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. మాల సామాజికవర్గంపై కక్షసాధింపుతోనే ఎస్సీ వర్గీకరణ విషయంలో కుట్రలు చేస్తున్నారంటూ ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి వైఖరిని ప్రకటించాలన్నారు. కులమతాల పేరుతో ప్రజలను విభజించి పాలించే పద్ధతిని బీజేపీ అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాలకుంట కేశవప్రసాద్, పెద్దిరెడ్డిపల్లి అరవిందకుమార్, నల్లూరి శంకర్‌బాబు పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని దాడి

ఐదుగురిపై కేసు

ధర్మవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలో లారీ డ్రైవర్‌పై దాడిచేసిన ఘటనకు సంబంధించి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నార్పల మండలం దామలూరు గ్రామానికి చెందిన గురుప్రసాద్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. 8 ఏళ్లక్రితం మదనపల్లి నుంచి దామలూరుకు వలస వచ్చాడు. ఏడాది క్రితం తాడిపత్రికి చెందిన జోసెఫ్‌తో రూ.50వేలు అప్పుగా తీసుకున్నాడు. గురుప్రసాద్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా జోసెఫ్ వద్ద తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వలేదు. దీంతో జోసెఫ్.. పలుమార్లు ఫోన్ చేసినా డబ్బు సర్దుబాటు కాలేదని చెప్పాడు. ఈ క్రమంలో ఈనెల 18న గురుప్రసాద్ లారీలో సిమెంట్ లోడ్ చేసుకుని తాడిపత్రి నుంచి బెంగళూరుకు బయల్దేరాడు. రాత్రి 10.30 గంటల సమయంలో ధర్మవరం మార్కెట్‌యార్డు వద్దకు రాగానే జోసెఫ్ అనుచరులు బాబాఫక్రుద్దీన్, కాశీం, సునీల్, అబ్దుల్లా, మరొక వ్యక్తి లారీని అడ్డగించి గురుప్రసాద్‌ను కిందకు దింపి, దాడిచేశారు. వారి నుంచి గురుప్రసాద్ తప్పించుకుని, మదనపల్లికి వెళ్లిపోయాడు. దీంతో దాడిచేసిన జోసెఫ్ అనుచరులు బాబాఫక్రుద్దీన్, కాశీం, సునీల్, అబ్దుల్లా, మరొక వ్యక్తిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గురుప్రసాద్ శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

మానవాళికి ఆదర్శం.. శ్రీకృష్ణుడి జీవితం

మంత్రులు సత్యకుమార్, సవిత

శ్రీకృష్ణుడి మందిర నిర్మాణానికి భూమి పూజ


పూజా కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీ నాయకులు

సోమందేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడి జీవితం సర్వమాన వాళికి ఆదర్శమని మంత్రులు సత్యకుమార్, సవిత పేర్కొన్నారు. స్థానిక నక్కలగుట్ట కాలనీలో శ్రీకృష్ణుడి మందిర నిర్మాణం భూమిపూజ కార్యక్రమంలో శుక్రవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి నిజ జీవితంలో ఆచరించిన విధానాలు నేటి మానవళికి అనుసరణీయమన్నారు. అన్ని కళలు సంపూర్ణంగా తెలిసినా మిడిసి పడక ప్రజలను గౌరవిస్తూ, ధర్మపాలన చేశాడని కొనియాడారు. కురుక్షేత్ర యుద్ధాన్ని తానొక్కడే ముగించే సత్తా ఉన్నా తను సూత్రధారిగా మారి అర్జునుడి చేత ధర్మయుద్ధం చేయించి దుష్టసంహారం గావించాడన్నారు. హితోపదేశం పేరుతో సర్వమానవాళికి భగవద్గీత అనే గొప్ప గ్రంథాన్ని అందించాడన్నారు.

2024లో ధర్మమే గెలిచింది : మంత్రి సవిత

2024లో జరిగిన ఎన్నికల్లో అధర్మంపై ధర్మం గెలిచిందని మంత్రి సవిత తెలిపారు. గత పాలకులు ఐదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని అంధకారం, అప్పుల్లో నెట్టినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోందన్నారు. శ్రీకృష్ణుడు బోధించిన గీతాసారాన్ని ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఒంటబట్టించుకుని ధర్మపాలన చేస్తున్నట్లు కితాబునిచ్చారు. పెనుకొండలో ఆగిన ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం త్వరలో ప్రారంభం అవుతుందన్నారు.

బీసీలు ఐక్యంగా ఉండాలి : బీకే పార్థసారథి, ఎంపీ

బీసీ కులాలు ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. అగ్ర కులాలను చూసి, అభివృద్ధి చెందినవారిని చూసి ఈర్ష్య పడరాదన్నారు. తమ పిల్లలను చదివించుకుని వ్యాపారాలు నిర్వహించి ఆర్థికంగా ఎదగడంతోపాటు రాజకీయంగా కూడా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు.

నిర్మాణాలకు విరాళాలు

ఈ సందర్భంగా ఆలయ నిర్మాణంతోపాటు కల్యాణమండపం నిర్మాణం కోసం మంత్రి సత్యకుమార్ రూ.5లక్షలు, మంత్రి సవిత రూ.5లక్షల 116 ప్రకటించారు. ఎంపీ బీకే పార్థసారథి రూ.20 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య రూ.5లక్షలు, ముదిగుబ్బ ఆదినారాయణ రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. మంత్రి సవిత అభ్యర్థన మేరకు 2027లోపు పెనుకొండలో అర్ధాంతరంగా ఆగిన వైద్య కళాశాల నిర్మాణాన్ని పూర్తిచేస్తామని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారు. అనంతరం వేణుమాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణ, కృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు మహేష్, ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నరసింహప్ప యాదవ్, అనంతపురంజిల్లా అధ్యక్షుడు వెంకటసూరి, రాష్ట్ర సంఘం నాయకులు నారాయణ, నగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరాముడు, కార్మిక సంక్షేమశాఖ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ జయసూర్య, జాతీయ యాదవ సంఘం నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దసరా, దీపావళికి ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ, దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని ప్రత్యేక వీక్లీ రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-తిరుపతి (07011) ప్రత్యేక వీక్లీ రైలు సెప్టెంబరు 5 నుంచి 26 వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07012) సెప్టెంబరు 6 నుంచి 27 వరకూ శనివారాలలో నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు మల్కాజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట, స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. తిరుపతి-హిసార్ ప్రత్యేక రైలు (07717) అక్టోబరు 1 నుంచి నవంబరు 26 వరకూ బుధవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07718)ను ఈ నెల అక్టోబరు 5 నుంచి నవంబరు 30 వరకూ ఆదివారాలలో నడుపుతామన్నారు. ఈ రైలు రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్ నగర్, జడ్చర్ల, కాచిగూడ, మల్కాజ్‌గిరి, మేడ్చల్, కామారెడ్డి,నిజామాబాద్,బాసర, ధర్మబాద్, ముడ్‌ఖేడ్, నాందేడ్, పూర్ణా, బస్మట్, హింగోళి, వాసిం, అకోలా, షేగావ్, మల్కాపూర్, భుసావల్, జల్‌గావ్, ధరన్‌గావ్, అమల్నేర్, నందుర్బార్, ఉద్నా, వడోదర, రత్లం, మాండ్‌సౌర్, నీమచ్, చిత్తౌర్‌ఘర్, భిల్వారా, బిజయ్‌నగర్, నాసిర్‌బాద్, అజ్మీర్, క్రిష్ణాఘర్, ఫులేరా, రింగస్, సికర్, నవాల్‌ఘర్, ఝుంజును, చిరావా, లోహారు, సదుల్‌పూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. నాందేడ్-ధర్మవరం (07189) ప్రత్యేక రైలు సెప్టెంబరు 5 నుంచి 26 వరకూ శుక్రవారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (07190) సెప్టెంబరు 7 నుంచి 28 వరకూ ఆదివారాలలో నడుస్తుందన్నారు. ఈ రైలు ముధ్ఖేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, ఆర్మూర్, లింగంపేట, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జమ్మికుంట, వరంగల్లు, మహబూబాబాద్, డోర్నకల్లు, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరం చేరుతుందన్నారు. బెంగళూరు-బీదర్ ప్రత్యేక రైలు (06549) ఈనెల 26న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06550) ఈ నెల 27న, బెంగళూరు-బీదర్ (06530) ప్రత్యేక రైలు సెప్టెంబరు 5 నుంచి 28 వరకూ శుక్ర, ఆదివారాలలో, దీని తిరుగు ప్రయాణపు రైలు (06540) సెప్టెంబరు 6 నుంచి 29 వరకూ శని, సోమవారాలలో నడుపుతున్నట్లు తెలియజేశారు. ఈ రైళ్లు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా నడుస్తాయన్నారు. యశ్వంతపూర్-ధన్‌బాద్ (06563) ప్రత్యేక రైలు ఈ నెల 23 నుంచి డిసెంబరు 27 వరకూ శనివారం, దీని తిరుగు ప్రయాణపు రైలు (06564) ఈ నెల 25 నుంచి డిసెంబరు 29 వరకూ నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట్, రామగుండం, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, నరసింగ్‌పూర్, మదన్‌మహల్, కట్ని, సాట్నా, ప్రయాగరాజ్, మీర్జాపూర్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బబువా రోడ్, ససరం, అనుగ్రహ నారాయణ్, గయ, కోడేర్మ, హజారీబాగ్, పరశ్‌నాథ్, గోమహ్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

సెక్టోరల్స్ భర్తీ ఎప్పుడో..?

ఇంటర్వ్యూలు ముగిసినా తేలని తుది ఫలితం



ఇంటర్వ్యూలకు హాజరైన టీచర్లు (ఫైల్)

అనంతపురం విద్య, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర శిక్ష సెక్టోరల్స్ పోస్టుల భర్తీ మళ్లీ సందిగ్ధంలో పడింది. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వచ్చిన వరుస కథనాలకు జిల్లా అధికారులు స్పందించి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం ఆరు సెక్టోరల్స్ పోస్టులకు 71మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 24 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 47మందికి ఈనెల 11, 12 తేదీల్లో కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టరు సచిన్ రహర్, డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 42మంది హాజరయ్యారు. అయితే ఇంటర్వ్యూలు ముగిసి 15రోజులు కావస్తున్నా పోస్టుల భర్తీ మాత్రం పూర్తి కాలేదు. ఇంటర్వ్యూలు ముగిసిన వెంటనే కలెక్టరుతో మాట్లాడి అభ్యర్థులను ప్రకటిస్తారని అందరూ ఊహించారు. ఇంటర్వ్యూల సమయంలో ఇన్‌చార్జ్ కలెక్టరుగా జేసీ శివనారాయణశర్మ ఉండేవారు. దీంతో ప్రక్రియ ముగుస్తుందని అనుకున్నారు. కానీ నియామకాల ప్రక్రియ జరగలేదు. అనంతరం శిక్షణకు వెళ్లిన రెగ్యులర్ కలెక్టరు వినోద్‌కుమార్ జాయిన్ అయ్యారు. దీంతో సెక్టోరల్స్ ఎంపిక కలెక్టరేట్‌లోనే ఉండిపోయింది. ఇప్పటికే ఏడాది కాలంగా సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న సెక్టోరల్స్ భర్తీ ఎప్పటికి పూర్తవుతోందోననే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

కలెక్టరేట్‌లో అప్పగించాం: శైలజ, ఏపీసీ, ఎస్ఎస్ఏ

సెక్టోరల్స్ నియామకాలకు సంబంధించి ఇంటర్వ్యూలు పూర్తి చేశాం. ఇంటర్వ్యూకు హాజరైన 42 మంది వివరాల ఫైలు అసిస్టెంట్ కలెక్టరుకు అప్పగించాం. అక్కడ నుంచి అభ్యర్థుల ఎంపిక జాబితా రావాల్సి ఉంది.

పరిశ్రమలను స్థాపించండి: కలెక్టర్


సమావేశంలో కలెక్టర్, జేసీ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో 61వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అన్ని శాఖల వారు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, పరిశ్రమలు ఏర్పాటు చేసేలా మంచి వాతావరణం కల్పించాలని ఆదేశించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులు ఇవ్వాలని సూచించారు. 2020-23 పాలసీలో రెండు యూనిట్లకు రూ.2,60,71 సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. స్టాండప్ ఇండియా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు విరివిగా రుణాలు మంజూరు చేయించాలని ఎల్డీఎంను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డీటీసీ వీర్రాజు, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ , ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై సమీక్ష

నిషేధిత జాబితాలోని 22ఏ, చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి 22ఏ కమిటీ, డీఎల్సీ/డీఎల్ఎస్సీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలిసి శుక్రవారం నిర్వహించారు. 22ఏకి సంబంధించిన32 క్లెయిమ్స్‌ను పరిశీలించారు. అందులో 25 ఆమోదించారు, మూడింటిని తిరస్కరించారు. నాలుగు దరఖాస్తులను పునఃపరిశీలించాల్సి ఉందని తెలిపారు. చుక్కల భూములకు సంబంధించి 26 క్లెయిమ్స్‌ను విచారించామని కలెక్టర్ తెలిపారు. అందులో 14 ఆమోదించామని, ఆరింటిని తిరస్కరించి, మరో ఆరింటిని పునఃపరిశీలించాలని ఆదేశించామని అన్నారు. 22ఏ, చుక్కల భూములకు సంబంధించి అనంతపురం రూరల్, కూడేరు, ఆత్మకూరు, రాప్తాడు, బెళుగుప్ప, శెట్టూరు, రాయదుర్గం, బ్రహ్మసముద్రం, పామిడి మండలాల పరిధిలో దరఖాస్తులను విచారించారు. సమావేశంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ-సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను ఉపేక్షించేది లేదు

అహుడా వైస్‌చైర్మన్, జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలోని అనధికార లేఅవుట్లను ఉపేక్షించేది లేదనీ, కఠిన చర్యలు తీసుకుంటామని అహుడా వైస్‌చైర్మన్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ హెచ్చరించారు. అహుడా కార్యాలయంలో శుక్రవారం అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అనధికార లేఅవుట్లలో మౌలిక వసతులు విద్యుత్తు, నీరు, రోడ్లు, మురుగు కాలవల నిర్మాణాలు చేపట్టబోమన్నారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) కింద ప్లాట్లకు అనుమతి పొందాలని సూచించారు. కార్యక్రమంలో అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివనారాయణ శర్మ

కదిరిలో గంజాయి ముఠా అరెస్టు

10 కిలోల సరుకు స్వాధీనం



పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న డీఎస్పీ

కదిరి అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా రవాణా చేసి, విక్రయిస్తున్న ముఠాను శ్రీసత్యసాయి జిల్లా కదిరి అప్‌గ్రేడ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి విలేకరుల సమావేశంలో శుక్రవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. కదిరి మండలంలోని కొండమనాయుని పాళ్యం గ్రామ సచివాలయం వద్ద గంజాయి ముఠా ఉన్నట్లు సమాచారం రావడంతో అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్టు చేసి, వారినుంచి 10కిలోల గంజాయి, మూడు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా మహారాష్ట్ర నుంచి అక్రమంగా గంజాయిని ఇక్కడికి తీసుకు వచ్చి.. చిన్న ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ కిలో రూ.2 వేలకు కొనుగోలు చేసి, ఇక్కడ రూ.7 వేల నుంచి రూ.10వేలకు విక్రయిస్తున్నారని డీఎస్పీ తెలిపారు. పట్టుబడినవారిలో కదిరికి చెందిన ఆజాద్, మహమ్మద్ సోయాద్, షేక్ ఇర్షాన్, షేక్ మహమ్మద్ హుస్సేన్, షేక్ అస్లాం, ఎస్ గౌస్ బాషా ఉన్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ఆజాద్.. గంజాయిని మహారాష్ట్రలోని పైజాపూర్‌లో రాజు అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి, అక్కడి నుంచి రైలులో పుట్టపర్తికి తీసుకువస్తాడు. అక్కడి నుంచి ద్విచక్రవాహనాలలో కదిరికి వచ్చి, చిన్న ప్యాకెట్లుగా మారుస్తారు. ఒక్కో ప్యాకెట్‌ను రూ.200 నుంచి రూ.500కు విక్రయిస్తుంటారు. గంజాయిని విక్రయిస్తున్న రాజును అరెస్టు చేసేందుకు మహారాష్ట్రకు ఓ బృందాన్ని పంపామని డీఎస్పీ తెలిపారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక


చైత్రేష్


రాహిల్


సోహానా


నిక్కీ శ్రీరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. ఇటీవల పిఠాపురంలో నిర్వహించిన ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో అదరగొట్టిన చైత్రేష్, రాహిల్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సోహానా, నిక్కీ శ్రీ ఎంపికైనట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, నరేంద్రచౌదరి తెలిపారు. ఎంపికైన వారు శనివారం నుంచి పిఠాపురంలో నిర్వహించే జాతీయ శిక్షణలో పాల్గొంటారనీ, అనంతరం పంజాబ్‌లోని లూధియానాలో జరిగే జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు.

హెచ్చెల్సీ ఏఈఈ ఆత్మహత్య

కుంగుబాటుతోనేనని తండ్రి ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కే నగర్‌లో శుక్రవారం రాత్రి హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో ఏఈఈగా పనిచేస్తున్న సుమియా(32) మానసిక కుంగుబాటుతో ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో సుమియా(32), ఆమె భర్త పామిడి మహమ్మద్ షఫీ(38) ఏఈఈలుగా పనిచేస్తున్నారు. ఆర్కె నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి మన్హా నాఫియా(3), మహిరా ఇరమ్(2) సంతానం. సుమియా కొంతకాలంగా హార్మోన్ల అసమతుల్యంతో మానసికంగా ఇబ్బంది పడుతుండేది. చికిత్స కూడా తీసుకుంటుండేది. వారంరోజులు ఆమె మాత్రలు వేసుకోలేదు. గురువారం ఆమె తల్లిదండ్రులు వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. రాత్రి సుమియా, ఆమె భర్త ఒక గదిలో, ఆమె తల్లిదండ్రులు, పిల్లలు మరో గదిలో పడుకున్నారు. తెల్లవారుజామున సుమియా ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు ఆమె తండ్రి గుర్తించాడు. హుటాహుటిన కారులో ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా... పరీక్షించిన డాక్టర్లు మరణించినట్లు నిర్ధారించారు. మానసిక వ్యాధితోనే మృతి చెందినట్లు సుమియా తండ్రి బాబా సాహెబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వచ్చే ఐదు రోజులు మోస్తరు వర్షం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటిగానీ, మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠంగా 33.4-34.2, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.4-24 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 13-15కి.మీ, వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ ఉదయంపూట 69-74, మధ్యాహ్నం 40-50 నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

● రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్

అనంతపురం క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(ఆర్‌బీఈఓ) వైబీపీటీఏ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలోని యూరియా విక్రయదారులు, డీలర్లు, సరఫరాదారులు రైతులకు సక్రమంగా యూరియాను అందజేయాలన్నారు. యూరియా డీలర్లపైన ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. యూరియాను వ్యవసాయేతర కార్యక్రమాలకు మళ్లించడం, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు అమ్మడం, స్టాకు ఉన్నా నో స్టాక్ బోర్డులు పెట్టడం వంటివి చేసి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.

మహిళా పక్షపాతి సీఎం చంద్రబాబు

స్త్రీనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత


స్త్రీ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కనగానపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మహిళల పక్షపాతి సీఎం చంద్రబాబు నాయుడు అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. సంక్షేమ పథకాల్లో మహిళలకే అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. కనగానపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటుచేసిన స్త్రీ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. మండలంలోని 513 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.4.46 కోట్ల రుణాలకు సంబంధించిన మెగా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వంటింటికే పరిమితమైన మహిళలను చైతన్య పరచి కుటుంబాలను స్వశక్తితో పోషించే స్థాయికి తెచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. త్వరలోనే ఆడబిడ్డ నిధి పథకం ప్రారంభమవుతుందనీ, 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, ఏపీఎంలు హనుమేష్, హేమలత, డీసీఎంఎస్, మార్కెట్ యార్డు చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

టంగుటూరి ప్రకాశం పంతులు (జయంతి)



స్వాతంత్ర్య సమరయోధుడు, 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోద రాయునిపాలెము గ్రామం లో జన్మించారు. మద్రాస్ ప్రెసిడెన్సీ విడిపోయి ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన వారాలు చేసుకుంటూ చదువుకున్నారు. అనంతరం స్వాతంత్ర్యసంగ్రామంలో కీలక భాగస్వామ్యులై, రాజకీయాల్లో రాణించి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. సైమన్ కమిషన్ ప్రదర్శనలో తుపాకికి ఎదురొడ్డినందుకు 'ఆంధ్రకేసరి'గా పేరొందారు. ప్లీడరు నుంచి బారిష్టరుగా ఎదిగి ఆర్థికంగా నిలదొక్కుకున్నా తన యావదాస్తిని దేశసేవకే ఖర్చు చేశారు. 1957 మే 20న పరమపదించారు. జాతికి చేసిన సేవలకు గుర్తుగా ఒంగోలు జిల్లాను 1972లో ప్రకాశం జిల్లాగా మార్చారు.

ప్రొఫెసర్ జి.వెంకటసుబ్బయ్య (జయంతి)



పద్మశ్రీ గ్రహీత కన్నడ నిఘంటువు రూపకర్త, వెంకటసుబ్బయ్య 1913 ఆగస్టు 23న కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లా శ్రీరంగపట్టణంలో జన్మించారు. కన్నడ భాష, సంస్కృతిపై మక్కువ కల్గిన సాహితీవేత్త. ఉపాధ్యాయుడిగా కెరీర్ ప్రారంభించి ప్రొఫెసర్‌గా ఎదిగారు. 12 నిఘంటువు (డిక్షనరీ) సంపుటాలను రాశారు. కవితలు, వ్యాకరణం, వ్యాసాలు వంటివి కన్నడలోకి అనువాదం చేశారు. 60కు పైగా పుస్తకాలు రాశారు. పలు పత్రికలలో ఆయన రచనలు ప్రచురితమయ్యాయి. 2011లో బెంగళూరులో జరిగిన 77వ అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షులుగా వ్యవహరించారు. కన్నడ రాజ్యోత్సవ, పంప అవార్డు, కన్నడ సాహిత్య అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 107వ యేట 2021 ఏప్రిల్ 19న కన్నుమూశారు.

గురుబిపిన్ సింగ్ (జయంతి)




'మణిపురి' నృత్య పితామహగా పేరొందిన గురు బిపిన్‌సింగ్ 1918 ఆగస్టు 23న అస్సాం రాష్ట్రం కాచార్ జిల్లా కేంద్రమైన సిల్చార్ లో జన్మించారు. దర్శకుడు, కొరియోగ్రాఫర్, టీచర్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇంఫాల్‌లో గోవింద్ జీ నర్తనాలయ డ్యాన్స్ స్కూల్ ఫర్ ఉమెన్, కోల్కత్తాలో మణిపురి నర్తనాలయ డ్యాన్స్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. నృత్య రూపకాలు, నాటికలు ప్రదర్శించి పేరొందారు. మణిపూర్ మహారాజా నుంచి 'హంజాబా', సంగీత నాటక అకాడమీ అవార్డు, శిరోమణి పురస్కార్, కాళిదాస్ సమ్మాన్ తదితర గౌరవాలు పొందారు. 2000 జనవరి 9న కన్నుమూశారు.

కేకే (జయంతి)



కేకేగా సుపరిచితులైన కృష్ణకుమార్ కున్నత్ 1968 ఆగస్టు 23న న్యూఢిల్లీలో నేపథ్య గాయకుడిగా హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, మరాఠా, బెంగాలీ, గుజరాతీ భాషలలో పాటలు పాడారు. 3,500కుపైగా జింగిల్స్ ఆలపించారు. సంగీత దర్శకుడు, రచయితగాను సత్తా చాటుకున్నారు. సోని మ్యూజిక్ విడుదల చేసిన 'పాల్' ఆల్బమ్ ఎంతో పేరొందింది. ఉత్తమ నేపథ్య గాయకుడిగా ఫిల్మ్‌ఫేర్, స్క్రీన్ అవార్డ్స్, జీ సినీ అవార్డ్స్ అందుకున్నారు. 2022 మే 31న కన్నుమూశారు.

కోబి బ్రాయంట్ (జయంతి)



'బ్లాక్‌మాంబా'గా గుర్తింపు పొందిన అమెరికన్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడిగా రాణించిన కోబి బ్రాయంట్ 1978 ఆగస్టు 23న ఫిలడెల్ఫియాలో జన్మించారు. 20 ఏళ్ల కెరీర్‌లో షూటింగ్ గార్డ్‌గా సత్తా చాటుకున్నారు. లేకర్స్ ఫ్రాంచైస్ హిస్టరీలో ఆల్‌టైమ్ లీడింగ్ స్కోరెర్‌గా నిలిచారు. నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్స్‌లో ఐదుసార్లు గెలుపొందారు. 20సీజన్స్‌లో తొలి గార్డ్‌గా నిలిచారు. తన నిక్‌నేమ్ 'బ్లాక్ మాంబా'గా పెట్టుకున్నాడు. పలు సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొని స్ఫూర్తిగా నిలిచారు. 41వ యేట విమాన ప్రమాదంలో 2020 జనవరి 26న కన్నుమూశారు.

సైరాబాను (పుట్టినరోజు)



ప్రముఖ హిందీ నటి సైరాబాను 1944 ఆగస్టు 23న ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరిలో జన్మించారు. 1960, 70 దశకాలలో అత్యంత ప్రజాదరణ కల్గిన నటిగా గుర్తింపు పొందారు. అప్పట్లో రొమాంటిక్ హీరోయిన్‌గా రాణించారు. ఉత్తమ నటిగా నాలుగు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందు కున్నారు. ప్రముఖ నటుడు దిలీప్ కుమార్‌ను పెళ్లి చేసుకున్నారు. జంగ్లీ, బ్లఫ్‌మాస్టర్ (1963), విక్టోరియా నెం.203, హేరా ఫెరి, బైరాగ్ తదితర సినిమాలు ఎంతో గుర్తింపు తెచ్చాయి.

రాజకాలువ ఆక్రమణలపై అధికారుల పరిశీలన

హొస్కోటె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జడిగేనహళ్ళి హోబళి చొక్కహళ్ళి పంచాయతీ పరిధిలోని దొడ్డనల్లూరహళ్ళిలో ప్రభుత్వభూములైన గోమాళ, రాజకాలువ సుమారు 5 ఎకరాల మేర ఆక్రమించి ప్రైవేట్ బిల్డర్‌లు లే అవుట్‌లు నిర్మించడాన్ని ఖండిస్తూ కర్ణాటక మహాసేన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ మంజునాథ్ మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబరు 10లోని భూమి ఆక్రమణకు గురైందన్నారు. సదరు ప్రభుత్వ భూమిని వెంటనే ఉన్నతాధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని డిమాండ్ చేశారు. సదరు భూమిని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాలూకా అధికారులు గురువారం సదరు స్థలాన్ని పరిశీలించారు. రెవెన్యూశాఖ అధికారి లక్ష్మమ్మ మాట్లాడుతూ ఆక్రమణలపై ఫిర్యాదు రావడంతో సర్వే చేపట్టామన్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. చొక్కహళ్ళి పీడీఓ రవికుమార్ మాట్లాడుతూ తాను ఇటీవల బాధ్యతలు తీసుకున్నానని, సర్వే నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామన్నారు. అధికారుల పర్యటన సందర్భంగా సంఘం పదాధికారులు, గ్రామస్తులు ఉన్నారు.



పరిశీలిస్తున్న అధికారుల బృందంతో సంఘం పదాధికారులు

రెన్యువల్ నియమాలు సడలించాలి

▸▸ ప్రైవేట్ విద్యాసంస్థల పాలకమండలుల సంఘం డిమాండ్

విజయపుర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థల రెన్యూవల్ సందర్భంగా పలు ఆంక్షలతో పాటు వివిధశాఖలనుంచి ఎన్‌ఓసీ పొందడాన్ని తప్పించేలా తగిన సడలింపులు చేయాలని ప్రైవేట్ విద్యాసంస్థల పాలకమండలుల తాలూకా అధ్యక్షుడు ఎస్‌ఎల్‌ఎన్ స్కూల్‌కు చెందిన ధనంజయ్ కోరారు. ప్రతి ఏటా రెన్యూవల్‌కు బదులు పదేళ్లకోసారి రెన్యూవల్ చేయాలని అభిప్రాయపడ్డారు. బెంగళూరులోని విధాన పరిషత్ మాజీ ఉపసభాపతి, ఎమ్మెల్సీ పుట్టణ్ణను ఆయన నివాసంలో భేటీ అయి దేవనహళ్ళి తాలూకా ప్రైవేట్ విద్యాసంస్థల తరపున మర్యాదపూర్వకంగా భేటీ అయి సత్కరించారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అనంతరం విజయపురలో ప్రగతి విద్యాసంస్థల అధ్యక్షుడు ఎం సతీశ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఎస్‌ఎస్‌ఎల్‌సీలో ఉత్తీర్ణతకు 33మార్కులకు నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కాగా ప్రస్తుతం అమలులో ఉన్న త్రిభాషాసూత్రాన్ని అమలు చేయాలని కోరినట్టు తెలిపారు. పుట్టణ్ణను భేటీ అయిన బృందంలో త్యాగరాజు, కెంపేగౌడ, సురేశ్, సయ్యద్ రఫీక్, మునిరాజు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ పుట్టణ్ణకు సన్మానం

సకారాత్మక భావనలు పెంచుకోవాలి



విద్యార్థులు, తల్లిదండ్రులతో డాక్టర్ సోమశేఖర్ తదితరులు

దొడ్డబళ్ళాపుర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడికి లోనుకాకుండా సకారాత్మక భావనలు పెంచుకోవాలని ఎస్‌ఎస్‌ఎల్‌సీ విద్యార్థులకు డాక్టర్ సోమశేఖర్ హితవు పలికారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ దొడ్డబళ్ళాపుర, ఆర్‌ఎల్ జాలప్ప ఇన్‌స్టిట్యూషన్, భారతీయ వైద్యసంఘం, భారత విద్యార్థి ఫెడరేషన్, దేవరాజ్ అరసు వసతి పాఠశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఎస్‌ఎస్‌ఎల్‌సీ విద్యార్థులకు మార్గదర్శకం చేశారు. ప్రపంచంలో ఏ విద్యార్థి మొద్దు కాదని అనే సత్యాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అర్థం చేసుకుని ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. మన ఆలోచనలు, నడవడిక పిల్లలపై ప్రభావం చూపుతాయన్నారు. వారి గెలుపోటములపై మన ప్రభావం ఉంటుందన్నారు. వారికి ధైర్యసాహసాలు పెంచేలా ప్రోత్సహించాలన్నారు. మంచి స్నేహం, అలవాట్లు, దైనందిన కార్యకలాపాలపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో చర్చాగోష్టి ఆసక్తికరంగా సాగింది. ఇన్‌స్టిట్యూషన్ అధ్యక్షుడు రవికిరణ్ అధ్యక్షత వహించగా బాబరెడ్డి, ప్రదీప్‌కుమార్, నాగరాజ్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలంబగిరి హుండీ

ఆదాయం రూ.16.50లక్షలు

చింతామణి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఆలంబగిరి గ్రామంలో కొలువైన కల్కి శ్రీలక్ష్మీవేంకటరమణస్వామి దేవాలయ హుండీ ఆదాయం రూ.16.59 లక్షలుగా ఉంది. తహసీల్దార్ సుదర్శన్ యాదవ్ నేతృత్వంలో ఉప తహసీల్దార్, గ్రామ లెక్కాధికారి సహా ఆలయ అర్చకులు, గ్రామ సహాయకులు, గ్రామ ప్రముఖుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. అనంతరం హుండీ ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాకు జమ చేసినట్టు అధికారులు తెలిపారు.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

వైసీపీ అక్రమాలపై

విజిలెన్స్..

అనంత నగర పాలక సంస్థలో కలకలం

డంపింగ్‌యార్డు



గత ఐదేళ్లలో చేసిన పనులు, బిల్లులపై విచారణ

అప్పటి అధికారులు, వైసీపీ నాయకుల్లో అలజడి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో నగర పాలక సంస్థలో అప్పటి అధికారులు, పాలకులు ఆడిందే ఆటగా సాగిందన్నది బహిరంగ రహస్యమే. దోచుకోవడం, జేబు నింపుకోవడమే లక్ష్యంగా వ్యవహారాలు సాగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్లీచింగ్ చల్లకనే చల్లినట్లు, పనిముట్లు కొనుగోలు చేయకనే రూ.లక్షలాది రూపాయల బిల్లులు చేసుకుని ఇష్టారాజ్యంగా నిధులను జేబుల్లోకి వేసేసుకున్నారు. ఇలా.. కోట్ల రూపాయలు స్వాహా చేశారు. ప్రజాధనాన్ని పక్కదారి పట్టించడంపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. దీంతో అప్పటి అధికారులు, వైసీపీ నాయకుల్లో అలజడి మొదలైంది. విజిలెన్స్ అధికారులు కూపీ లాగితే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. 2019-24 సంవత్సరాల మధ్య కొనుగోలు చేసిన పనిముట్లు, బ్లీచింగ్ పౌడర్, డంపింగ్ యార్డు నిర్వహణ, నగరంలో సుందరీకరణ పనులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ కట్టడాలు అనే 6 అంశాలపై విచారణ చేస్తున్నారు.



బ్లీచింగ్ పౌడర్

పంచేసుకున్నారు..

ఇబ్బడిముబ్బడిగా తమకు అనుకూలంగా ఉండే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం రూ.లక్షల్లో కమీషన్లు బొక్కేయడం అప్పట్లో యథేచ్ఛగా సాగింది. వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ తతంగం నడిచింది. ఇలా నగర పాలక సంస్థలో వైసీపీ ఐదేళ్ల పాలనలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేశారు. పనిముట్ల కొనుగోలుకు రూ.30లక్షలు, బ్లీచింగ్ పౌడర్‌కి రూ.67లక్షలు, సుందరీకరణకు రూ.6 కోట్లు, డంపింగ్ యార్డు నిర్వహణకు రూ.23 కోట్లు మంజూరు చేయగా.. రూ.12కోట్లు అప్పట్లోనే చెల్లించారు. ఐదేళ్లలో రూ.30కోట్ల వరకు నిధులు దుర్వినియోగమైనట్లు అభియోగాలు నమోదయ్యాయి. అప్పట్లో డీఈగా పనిచేసిన ఓ అధికారి తిరిగి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో రూ.కోట్ల అవినీతిలో భాగస్వామి అయిన ఆ అధికారిని తిరిగి ఇక్కడ ఎలా చేర్చుకుంటారనే అంశంపై ఏఎంసీలో జోరుగా చర్చ సాగుతోంది.

పనులు చేయకనే రూ.23కోట్లు స్వాహా

గత వైసీపీ ప్రభుత్వం డంపింగ్ యార్డు పేరుతో కోట్లాది రూపాయల నిధులు మింగేసింది. 2019 ఎన్నికలకు ముందు అప్పటి వైసీపీ అభ్యర్థులు డంపింగ్ యార్డు తరలిస్తామని ప్రగల్భాలు పలికినా ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు. చెత్త తరలింపు పేరుతో అప్పట్లో రూ.23కోట్ల మేర బిల్లులు చేసుకుని, మెక్కేశారు. చెత్త, మట్టిని అక్రమంగా తరలించిన వైసీపీ ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయల సొమ్మును జేబుల్లోకి వేసుకున్నారు. అప్పట్లోనే ఒకే సమయంలో రూ.12 కోట్ల బిల్లులు చెల్లించారు. ఇదే విషయాన్ని వైసీపీకి చెందిన కార్పొరేటర్లే పలు కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తడం గమనార్హం. ఈ వ్యవహారాల నేపథ్యంలో విజిలెన్స్ విచారణ అధికారులు, వైసీపీ నేతల్లో అలజడి రేపుతోంది.

విజిలెన్స్ విచారణ నిజమే



మున్సిపల్ కార్పొరేషన్‌లో విజిలెన్స్ విచారణ కొనసాగుతున్న విషయం వాస్తవమే. విజిలెన్స్ అధికారులు అడిగిన అన్ని వివరాలు అందజేస్తున్నాం. విచారణకు సహకరిస్తున్నాం.

- బాలస్వామి,
అనంత నగరపాలక సంస్థ కమిషనర్

అంతా.. గుట్టుగా..

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో జాగ్రత్తలు

సమాచారం బయటకు పొక్కకుండా చర్యలు

25న సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం విద్య, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాల విషయంలో రాష్ట్ర విద్యాశాఖ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని, ప్రతి ప్రక్రియ అత్యంత గోప్యంగా చేపడుతోంది. అందులో భాగంగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతంలో కొన్ని కమిటీలు వేసి అర్హత సాధించిన అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచి చేయించేవారు. ముందుగానే ఏ సబ్జెక్టుకు ఏ టీమ్ సభ్యులు ఉన్నారో తెలిసిపోయేది. అందులో అనుకూలమైన వారితో సర్టిఫికెట్లలో కొన్ని పొరపాట్లు ఉన్నా ఓకే చేయించుకుని వెళ్లేవారనే ఆరోపణలు ఉన్నాయి. నాన్‌లోకల్ వారు లోకల్‌గా చదివినట్లు బోగస్ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందేవారు. 2008 డీఎస్సీలో ఇలాగే కడప జిల్లాకు చెందిన 30 మందికిపైగా లోకల్‌గా చదివినట్లు సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందగా.. వాటిపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో పునఃపరిశీలన చేయించి, ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈసారి అలాంటి వాటికి అవకాశం లేకుండా వెరిఫికేషన్‌లో గోప్యత పాటిస్తున్నారు. అభ్యర్థులకు ఎంపికైనట్లు పంపిన మెసేజ్‌లోనే సర్టిఫికెట్ల పరిశీలన తేదీ, కేంద్రం, కమిటీ వివరాలు పంపారు. జిల్లాలో వెరిఫికేషన్‌కు 16 బృందాలను నియమించారు. మెసేజ్‌లో ఇచ్చిన మేరకు ఆయా బృందాల సభ్యుల వద్దకెళ్లి తమ సర్టిఫికెట్లను అభ్యర్థులు వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఆ వెంటనే ఆన్‌లైన్‌లో ఓకే అయిపోతుంది. అందులో సమస్యలు ఉత్పన్నమైతే వెరిఫికేషన్ చేసిన బృందం సభ్యులు బాధ్యత వహించాల్సి ఉం టుంది. సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 25న ఉంటుందని రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా విద్యాశాఖ ఆలుమూరు రోడ్డులోగల పీవీకేకే ఎంబీఏ కళాశాలలో పరిశీలనకు ఏర్పాట్లు చేపట్టింది. డీఈఓ ప్రసాద్ బాబు, ఇతర కమిటీల సభ్యులు, ఐటీ విభాగ సిబ్బంది శుక్రవారం కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు.



పీవీకేకే కాలేజీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ, కమిటీ సభ్యులు

మెరిట్ లిస్టులోనూ ట్విస్టు

గతంలో ముందుగానే మెరిట్‌లిస్టు విడుదల చేసేవారు. ఏ రోస్టర్‌కు, ఎన్ని మార్కులకు పోస్టు వస్తుందో తెలిసిపోయేది. దీంతో కొందరు డీఈఓ కార్యాలయంలో పనిచేసేవారు దళారీలను రంగంలోకి దించి, ఎక్కడవరకు ఎవరికి పోస్టు వస్తుందో తెలుసుకుని వారితో బేరసారాలు సాగించి జేబులు నింపుకునేవారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఇలాంటి వ్యవహారానికి సంబంధించిన ఆడియో గతంలో బయటపడడంతో ఒకరిని సస్పెండ్ కూడా చేశారు. అందుకే ఈసారి ప్రతి ప్రక్రియను రాష్ట్రశాఖే చేపడుతోంది. ఇప్పటికే మెరిట్ ఆధారంగా అర్హత అభ్యర్థుల ఎంపిక పూర్తి చేశారు. ఆ జాబితాలో కూడా పొరపాట్లకు తావులేకుండా జిల్లాల వారీగా విద్యాశాఖ ఉద్యోగులను రాష్ట్ర కార్యాలయానికి పిలిపించుకుని మెరిట్, రోస్టర్ ఆధారంగా కరెక్టుగా ఉన్నాయో.. లేదో.. పరిశీలించారు. ఆ ప్రక్రియ పూర్తి కావడంతో శుక్రవారం రాత్రి మెరిట్‌లిస్టు విడుదల చేశారు.

కాళికాంబకు ప్రత్యేక పూజలు

శిడ్లఘట్ట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని పట్టణంలోని నగరపేటలో కొలువైన కాళికాంబిక కోమటేశ్వర ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకు మార్చన, ధూపదీప నైవేద్యాలను సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



విశేష అలంకరణ

ఈశాన్య రాష్ట్రాల్లోనూ కంట్రీక్లబ్ సేవలు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆతిథ్యసేవా విభాగంలో పేరొందిన కంట్రీక్లబ్ తాజాగా ఈశాన్యరాష్ట్రాలలోనూ సేవలు ప్రారంభించినట్టు కంట్రీక్లబ్ చైర్మన్ ఎండీ వై రాజీవ్‌రెడ్డి ప్రకటించారు. గురువారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ సిక్కింలోని గ్యాంగ్టక్‌లో కొత్త రిసార్టును ప్రారంభించామన్నారు. నిరంతరం మేఘావృతం, వర్షాలతోపాటు ప్రకృతిలో ప్రత్యేకం అనిపించేలా సిక్కింను సందర్శించాలనుకునేవారికి ఇదో ప్రత్యేక అవకాశమన్నారు. బెంగళూరు నుంచి నేరుగా విమానసర్వీసులు ఉన్నాయన్నారు. ఇదే సందర్భంగా వీఐపీ గోల్డ్‌కార్డ్ మెంబర్‌షిప్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

తరంగ్ ఉత్సవ్‌లో వృద్ధుల సందడి

బెంగళూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వరల్డ్ సీనియర్ సిటిజన్స్ డేను పురస్కరించుకుని సిరిన్ కమ్యూనిటీస్ సాంస్కృతిక సందడి చేసేలా తరంగ్ ఉత్సవ్‌ను నిర్వహించారు. నగరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో చెన్నై, కోయంబత్తూరుతోపాటు పది నగరాలనుంచి 250 కుటుంబాలతోపాటు వెయ్యి మంది పాల్గొన్నారు. తరంగ్ అంటే లయ, అలలు అనే పేరు అని ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ గ్రహీత కామినిరావ్ అభిప్రాయపడ్డారు. సిరిన్ డైరెక్టర్ సీఈఓ రాజగోపాల్ మాట్లాడుతూ దేశంలో 150 మిలియన్ల సీనియర్ సిటిజన్లు ఉన్నారని, వారు సమాజానికి ఎన్నో రంగాలలో సేవ చేసినవారు ఉన్నారన్నారు. వృద్ధాప్యంలో ప్రశాంతంగా గడిపేలా సమాజంలో అందరూ సహకరించాలన్నారు.

ఫుట్‌బాల్ అంటే యువతకు క్రేజ్: రిజ్వాన్ అర్షద్



ఫుట్‌బాల్ క్యాంప్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రిజ్వాన్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ అంటే యువతకు క్రేజ్ అని ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్‌కు ఆదరణ ఉందని శివాజినగర్ ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ అన్నారు. యునైటెడ్ ఫుట్‌బాల్‌క్లబ్ ప్రతిభావంత క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు రెసిడెన్షియల్ అకాడమీని లాంఛనంగా ప్రారంభించారు. క్లబ్ డైరెక్టర్ శరణ్‌పారిక్, సీఈఓ మహ్మద్ రఫీక్, క్రిమ్సన్ ఎడ్యుకేషన్ కో సీఈఓ హుసేన్ దోహద్‌వాలాలు పాల్గొన్నారు. శరణ్‌పారిక్ మాట్లాడుతూ అండర్ 13, 15, 17 విభాగాలలో శిక్షణలు ఇవ్వదలిచామన్నారు. రెసిడెన్షియల్ అకాడమీ ఫీఫా స్టాండర్స్ ఫుట్‌బాల్ సౌలభ్యాలు కల్పిస్తుందన్నారు. ఫ్లడ్‌లైట్ పిచ్‌లోనూ ఆడే నైపుణ్యం కల్పిస్తామన్నారు. జిమ్, ఫిజియోథెరపీ, ఐస్‌బాత్, స్టీమ్‌రూంలు ఉన్నాయన్నారు.

అధ్యాపకుడిపై కత్తితో దాడి



దాడికి గురైన అధ్యాపకుడు హనుమంతు



నిందితుడు వీరణ్ణ మాకాపూర

రాయచూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా ముదగల్ పట్టణంలో అధ్యాపకుడిపై ఓ వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న హనుమంత కంబార అదే గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు వీరణ్ణ మాకాపూరతో తీసుకున్న అప్పు తీర్చకపోవడమే గొడవకు కారణంగా తెలిసింది. తాను తాకట్టు ఉంచిన బంగారాన్ని విడుపించుకునేందుకు శుక్రవారం ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయానికి వచ్చిన హనుమంతుతో అక్కడే ఉన్న రుణం ఇచ్చిన వ్యక్తి ఘర్షణకు దిగారు. ఇద్దరి మధ్య మాట మాట పెరగడంతో ఒక్కసారిగా హనుమంతును కత్తితో దాడి చేయగా అతని తలకు గాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన అధ్యాపకుడిని ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. తుర్విహాళ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

హైడాతాన్-2025లో ఎస్కేయూకు మొదటి బహుమతి

అనంతపురంరూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హైడాతాన్-2025 పోటీల్లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి మొదటి బహుమతి దక్కినట్లు వైస్‌చాన్సలర్ అనిత తెలిపారు. పోటీల్లో పాల్గొని బహుమతి సాధించిన విద్యార్థుల బృందాన్ని ఆమె రిజిస్ట్రార్ రమేష్‌బాబు తో కలిసి శుక్రవారం అభినందించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం-డీట్ భాగస్వామ్యంతో గుర్తింపు ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గర్వం అవార్డ్స్ -సీజన్4లో భాగంగా హైడాతాన్-2025 పోటీలను జూన్ 26నుంచి ఆగస్టు 21 వరకు ఐదు దశల్లో నిర్వహించారన్నారు. ఫైనల్ రౌండ్ పోటీలు 21న హైదరాబాదులోని టీ హబ్‌లో జరిగాయన్నారు. ఇందులో వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల బృందం ఇన్నోవేషన్ ఇంటిగ్రేటెడ్ సొల్యూషన్స్‌లో మొదటి స్థానంలో సాధించినట్లు వెల్లడించారు. దీంతో వారికి రూ.35వేల నగదు బహుమతి దక్కినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.53	1626.31
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	98,843	33,443
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	94,551	9,413
నీటి నిల్వ (టీఎంసీలు)	74.97	80.86

నీట మునిగిన ఆలయం



నీట మునిగిన హూళె బసవేశ్వర ఆలయం

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం ఎక్కువ అవుతుండటంతో నదీతీర ప్రాంతాల్లో చారిత్రక కట్టడాలు నీట మునిగాయి. ఇందులో భాగంగానే కొప్పళ జిల్లా కారటగి తాలూకాలో ఉన్న హూళె బసవేశ్వర ఆలయం నదిలో పూర్తిగా మునిగి పోయింది. గోపురం మాత్రం పైకి కనిపిస్తోంది. నది ప్రవాహం తీవ్రత కారణంగా తాలూకా పరిధిలోని నందిహళ్ళి, కక్కరగోళ, శాలిగనూరు, బెన్నూరు, ఉళెనూరు, జమాపుర, కుంటోజి, ముష్టూరు, డగ్గి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హెల్మెట్ తప్పనిసరి: ఎస్పీ



విలేకరులకు హెల్మెట్ పంపిణీ చేస్తున్న ఎస్పీ శోభారాణి

కంప్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని ఎస్పీ డాక్టర్ శోభారాణి అన్నారు. శుక్రవారం కంప్లి పోలీస్‌స్టేషన్లో పాత్రికేయులకు హెల్మెట్‌లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నలుమూలలు తిరిగే పాత్రికేయులు ద్విచక్రవాహనంపై వెళ్లే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మీపై ఆధారపడిన కుటుంబం గురించి ఆలోచించాలన్నారు. ఇకపై పట్టణంలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్‌తో పాటు ద్విచక్ర వాహన ఆర్సీ, ఇన్సురెన్స్ తప్పనిసరిగా వుండాలన్నారు. డీఎస్పీ ప్రసాద్ గోఖలే, సీఐ వాసు కుమార్, విలేకరులు పాల్గొన్నారు.

వంతెనపై రాకపోకలు ప్రారంభం



వంతెనపై ప్రయాణిస్తున్న వాహనాలు

కంప్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కంప్లి కోట తుంగభద్ర వంతెనపై వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం అధికారులు వంతెనను పరిశీలించిన అనంతరం ద్విచక్ర, త్రిచక్ర వాహనదారులకు, కార్లకు, స్కూలు వ్యాన్లకు వంతెనపై ప్రయాణానికి అనుమతులు ఇచ్చారు. పీడబ్ల్యూడీ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ తేలిక వాహనాలకు మాత్రమే ప్రయాణం చేయవచ్చున్నారు. నాలుగైదు రోజులు అనంతరం వంతెన పరిశీలించి బరువైన వాహనాలు వెళ్లేందుకు అనుమతులు ఇస్తామన్నారు. సిబ్బందితో వంతెనకు ఇరువైపులా చెత్తాచెదారాన్ని తొలగించారు.

ఎట్టకేలకు చిక్కిన ఎలుగుబంటి



బోనులో ఉన్న ఎలుగుబంటి

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా కేంద్రం హొసపేటలో గత కొన్ని రోజులుగా సంచరిస్తున్న ఎలుగుబంటిని పశువైద్యుల సహాయంతో మత్తుమందు ఇంజెక్షన్ ఇచ్చి అటవీశాఖ అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. సండూరు రోడ్డు అన్నపూర్ణ గ్యారేజీ సమీపంలో ఎలుగుబంటి తిరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సిబ్బందితో చాకచక్యంతో పట్టుకున్నారు. అనంతరం దానిని బోను ద్వారా కమలాపురం అటల్ బిహారీ వాజ్‌పేయి జూకు తరలించారు.

హామీ పథకాలు మంచి పురోగతి సాధించాయి

● హామీ పథకాల అమలు చైర్మన్ చిదానందప్ప



మాట్లాడుతున్న చిదానందప్ప

బళ్లారి సిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం అమలు చేసిన ఐదు హామీ పథకాలు మంచి పురోగతిని సాధించాయని హామీ పథకాల అమలు అథారిటీ జిల్లా చైర్మన్ చిదానందప్ప అన్నారు. శుక్రవారం నగరంలోని కోటే ప్రాంతం జిల్లా పంచాయతీ హాల్లో నిర్వహించిన హామీపథకాల జిల్లా ప్రగతి సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐదు హామీ పథకాల పురోగతి బాగుందన్నారు. మొత్తం 54,49 లక్షల మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి యోజన కింద సబ్సిడీ అందించామని, ఈపథకం కింద(ఫిబ్రవరి, మార్చి- 2025 మినహా) ప్రభుత్వం రూ.1089.80కోట్లు చెల్లించిందన్నారు. ఇది ఒక ప్రధాన మైలు రాయి అని అన్నారు.

ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించండి: గృహలక్ష్మి యోజన కింద నమోదు చేసుకున్న లబ్ధిదారులకు వివిధ కరణాల వల్ల చెల్లింపులు జరగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని చిదానందప్ప అన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక శిబిరం నిర్వహించి వారికి తగిన సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలని టీపీఏ, ఈఓలను ఆదేశించారు. జిల్లాస్థాయిలో కూడా ప్రగతి సమీక్ష సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తాలూకా గ్యారంటీ పథకాల అధ్యక్షుడు గోనాల్ నాగభూషణ్ గౌడ, కురుగోడు తాలూకా అధ్యక్షుడు బసవనగౌడ, కంప్లి అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, సిరుగుప్ప అధ్యక్షుడు మారుతి వరప్రసాద్ రెడ్డి, స్త్రీ శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులను నియమించండి

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ప్రారంభమై నెలగడిచినా ఇప్పటి వరకు అధ్యాపకులు లేకపోవడంతో తరగతులు నడవడం లేదంటూ అఖిల భారతీయ విద్యార్థిపరిషత్, బళ్ళారి విభాగం ఆందోళన చేపట్టింది. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న వందలాది మంది విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి రాయల్ సర్కిల్ చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ కె.దిలీప్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో డిగ్రీ కళాశాలలు అతిథి అధ్యాపకులపై ఆధారపడి ఉన్నాయని, ఇంతవరకు సంబంధిత అధ్యాపకులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి యేడాది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇదే పరిస్థితి నెలకొనడం సర్వసాధారణమైందన్నారు. కళాశాలలో అధ్యాపకులు లేకపోవడంతో పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కాలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించి వీలైనంత త్వరలో అతిథి అధ్యాపకులను నియమించి విద్యార్థులకు పాఠశాలు బోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి సమర్పించిన లేఖను జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రాకు అందజేశారు. కార్యక్రమంలో సంఘటా కార్యదర్శి నాగరాజు బటగేరా, శివాని సాగర్, భరత్, దర్శన్, కృష్ణ, శ్రీనివాస్, పవన్ కుమార్, సృష్టి, ఐశ్వర్య పాల్గొన్నారు.



క్లాక్ టవర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అక్రమంగా యూరియా నిల్వ

ఐదు దుకాణాల సీజ్, లైసెన్సులు రద్దు



జిల్లా వ్యవసాయ శాఖ జేడీ సోమసుందర్

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యూరియాను అక్రమంగా నిలువ ఉంచి అధిక ధరకు అమ్ముతున్న కంప్లి తాలూకా పరిధిలోని ఐదు దుకాణాలపై దాడులు చేసి సీజ్ చేసినట్లు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సోమసుందర్ తెలిపారు. దుకాణాల లైసెన్సులు కూడా రద్దు చేశామని ఆయన తెలిపారు. కురుగోడు తాలూకాలో 54 బస్తాల యూరియాను అక్రమంగా రవాణా చేస్తున్న మహిళా రైతుపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశామన్నారు. గుల్బర్గా భీమా కృష్ణ రసాయినిక ఎరువుల కంపెనీలో తయారైన యూరియాను కురుగోడుకు అక్రమంగా తీసుకొచ్చి వాహనాల్లో పెట్టుకుని మహిళ అమ్ముతున్నట్లు విచారణలో తేలిందన్నారు. జిల్లాలో యూరియా కొరత తీర్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా నిరంతరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఖరీఫ్‌లో జిల్లాలో 44,350 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 37,668 టన్నుల యూరియా సరఫరా చేసినట్లు, ఇంకా 5,111 టన్నులు నిలువ ఉన్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో 1,933 టన్నుల యూరియా జిల్లాకు రానున్నట్లు తెలిపారు. జిల్లాలో వరిసాగు ఎక్కువ అవుతున్న తరుణంలో యూరియాకు డిమాండ్ పెరిగిందని, రైతులు డిమాండ్‌కు మించి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

తాగిన మత్తులో కాలువలో పడిన వ్యక్తి

● ఆచూకీ కోసం రక్షణ సిబ్బంది గాలింపు



వ్యక్తి కోసం గాలిస్తున్న రక్షణ సిబ్బంది

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువ గట్టున తాగిన మత్తులో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి కాలువలో కొట్టుకుపోయిన ఘటన గంగావతి తాలూకా సణాపుర గ్రామ సమీపం గంగామ్మగుడి వద్ద చోటు చేసుకుంది. కాలువలో పడిన వ్యక్తి గంగావతి పట్టణంలోని జయనగర్‌కు చెందిన విజ్‌డం ఆంగ్ల మీడియం పాఠశాల యజమాని రాజకిరణ్ ఇంగళ్ళి(36)గా పోలీసులు గుర్తించారు. వ్యక్తిగత సమస్యల కారణంగా గురువారం సాయంత్రం సణాపుర ప్రాంతానికి వెళ్లి అతిగా మద్యం తాగి కారులో కాలువపై వస్తూ జంగ్లికాస్రవద్ద వాంతులు చేసుకుని కాలువలో దిగి శుభ్రం చేసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు పడిపోయినట్లు పోలీసులు తెలిపారు. వ్యక్తి ఆచూకీ కోసం రక్షణ సిబ్బంది ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది తెప్పల సహాయంతో కాలువలో వెతుకుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమాజ సేవకురాలు శివరుద్రమ్మ మృతి



కంప్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కురుగోడు తాలుకా డీ కగ్గల్ గ్రామానికి చెందిన సమాజ సేవకురాలు శివరుద్రమ్మ (80) గురువారం సాయంత్రం మృతి చెందారు. ఈమెకు ఎనిమిది మంది కుమారులు, ఒక కుమార్తె వున్నారు. శుక్రవారం సొంత గ్రామంలోని అంత్యక్రియలు చేపట్టారు. జిల్లాలోని పలువురు సమాజ సేవకులు, నాయకులు, సంఘ సంస్థ ప్రతినిధులు, గ్రామప్రజలు ఆమె మృతికి సంతాపం తెలిపారు.

కేబుల్ చోరీ



మోటార్లకు వైర్లు అమర్చుతున్న రైతులు

కంప్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని సన్నాపురం నదిఒడ్డున ఉన్న మోటార్లకు బిగించిన కేబుల్‌ను దుండగులు ఎత్తుకెళ్లారు. సన్నాపురం నారాయణస్వామి క్యాంపు, మారెమ్మ క్యాంపు, ఇటిగి తదితర ప్రాంతాల్లో రైతన్నలకు చెందిన మోటార్ల కేబుల్‌ను గురువారం రాత్రి దొంగిలించారు. రైతులు మాట్లాడుతూ ఈ యేడాది నదికి పలుసార్లు నీరు రావడంతో మోటార్లలో నీరు చేరుకుని ధ్వంసమై ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నామన్నారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. శుక్రవారం నారాయణస్వామి క్యాంపు వద్దకు పోలీసులు వచ్చి రైతులతో మాట్లాడారు. ఈ విషయంపై అధికారులకు తెలియజేస్తామన్నారు. పోలీసు శాఖ వెంటనే అప్రమత్తమై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



వృద్ధాశ్రమంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న అభిమానులు

సిరుగుప్ప, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి జన్మ దిన వేడుకలు ఆయన అభిమాన సంఘం తాలూకా అధ్యక్షుడు మూర్తి పవన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణం విశ్వగురు బసవేశ్వర వృద్ధాశ్రమంలో చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అన్నదా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. మూర్తిపవన్ మాట్లాడుతూ 157 చిత్రాలను నటించి ఎన్నో అవార్డులను చిరంజీవి అందుకున్నారన్నారు. కార్యక్రమంలో అభిమానులు వినయ్, చంద్ర, అభి, ఉరుకుంద, చిట్టిబాటు, మహేష్, బంద్రాల్ మల్లికార్జున స్వీట్లు పంచారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు గాలి సోమశేఖర్‌రెడ్డి

ధర్మస్థలపై అనవసర ఆరోపణలు తగవు

● బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

బళ్లారి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మస్థల పుణ్యక్షేత్రంపై అనవసర ఆరోపలు చేయడం తగదని బీజేపీ నాయకులు శుక్రవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. ముందుగా రాయల్ సర్కిల్‌లో మానహారం ఏర్పడి ధర్మస్థలపై ఆరోపణలు చేయడం మంచిది కాదని నినదించారు. అనంతరం ర్యాలీగా వచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక మతిస్థిమితం లేని వ్యక్తి, అదీ ఎవరోడబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తుల మాటల ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడం సిగ్గుచేటని సీఎంపై నిప్పులు చెరిగారు. హిందుత్వాన్ని దెబ్బతీసే విధంగా కొందరు వ్యక్తులు కావాలనే ధర్మస్థలపై నిందలు వేశారని అన్నారు. అనంతరం డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోత్కర్ శ్రీనివాసులు, రాష్ట్ర మహిళా నాయకురాలు డాక్టర్ అరుణ, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మూడు నెలల్లో రహదారి పనులు పూర్తి చేస్తాం

● ఎంపీ రాజశేఖర్ ఇత్నాల్



మాట్లాడుతున్న ఎంపీ రాజశేఖర్ ఇత్నాల్

సిరుగుప్ప, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మూడు నెలల్లోపు ఎన్‌హెచ్ 150 రహదారి పనులు పూర్తి చేస్తామని కొప్పళ ఎంపీ రాజశేఖర్ ఇత్నాల్ అన్నారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణ అతిథి గృహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రహదారి పనులు పెండింగ్‌లో పడినట్లు ఆయన తెలిపారు. నూతన టెండర్లు పిలిచి పనులను చేపడతామన్నారు. తాత్కాలికంగా రూ.10 లక్షల ఎంపీ నిధులతో మరమ్మతు పనులు చేస్తామన్నారు. తుంగభద్ర డ్యామ్‌కు గేట్లు అమర్చడంపై ఐసీసీ సమావేశంలో తీర్మానిస్తామని తెలిపారు. తహసీల్దార్ గౌసియా బేగమ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కరిబసప్ప, సీనియర్ నాయకులు బీఎం సతీష్, తిమ్మప్ప నాయక్, మల్లికార్జున, బాలప్ప, గోపాల్‌రెడ్డి, గ్యారెంటీ సమితుల అధ్యక్షుడు మారుతీ వరప్రసాద్ రెడ్డి, సంతోష్ శెట్టి, గణేష్, మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుద్ధిమాంద్య కేంద్రం అభివృద్ధికి రూ.3 లక్షల విరాళం



డీడీని అధికారులకు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

హొస్పేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాధ్య ట్రస్ట్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ నిర్వహిస్తున్న బుద్ధిమాంద్య పిల్లల శిక్షణా కేంద్రం అభివృద్ధి శ్రీక్షేత్ర ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి ప్రాజెక్టు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద డాక్టర్ డి వీరేంద్ర హెగ్గడే రూ.3లక్షల డీడీని శుక్రవారం ట్రస్ట్ అధ్యక్షురాలు ఆర్తికెటికి పూజ్యకు అందజేశారు. కార్యక్రమంలో తాలూకా ప్లానింగ్ ఆఫీసర్ మంజునాథ్‌నాయక్, వ్యవసాయ పర్యవేక్షకుడు చన్నప్ప, మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

దీక్ష భూమికి రవాణా సౌకర్యం

హొస్పేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో దీక్ష భూమిని సందర్శించే యాత్రికుల కోసం సాంఘిక సంక్షేమ శాఖ బస్సు, రైలు సౌకర్యం కల్పించినట్లు డిప్యూటీ డైరెక్టర్ యల్లేషా ఆనంద్ కాలే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 9వరకు సాంఘిక సంక్షేమ శాఖ వెబ్‌సైట్ లింక్ ద్వారా ఆల్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హొస్పేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హొస్పేట్ తాలూకాలో పీఎంకేఎస్‌వై పథకం కింద మైక్రో ఇరిగేషన్ యూనిట్లకు, పీఎంకేఎస్‌వై-పీడీఏసీ కార్యక్రమం కింద పీవీసీ పైపులకు సబ్సిడీ కోసం రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించినట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ మనోహర్ గౌడ్ తెలిపారు. కేంద్రప్రాయోజిత ప్రధాన మంత్రి ఆర్‌కేవీవై పీడీఎంసీ మైక్రో ఇరిగేషన్ కార్యక్రమాన్ని హొస్పేట తాలూకాలోని బిందు, స్ప్రింక్లర్ల యూనిట్లకు సబ్సిడీ కింద పంపిణీ చేస్తారన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులకు నీటి వనరు ఉండాలని, గరిష్టంగా 0.2హెక్టార్ల విస్తీర్ణం వరకు 90శాతం ప్రభుత్వ సబ్సిడీ అందిస్తారన్నారు. ప్రభుత్వం ఆమోదించిన సంస్థల నుంచి నీటిపారుదల యూనిట్లు మాత్రమే సబ్సిడీకి అర్హులన్నారు. రైతులు వ్యక్తిగత వివరాలు మొబైల్ నంబర్, భూమి టైటిల్, హోల్డింగ్ లెటర్, చెక్ బాండ్, వాటర్ సోర్స్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు కాపీ, ఫొటోలు, బ్యాంక్‌ఖాతా వివరాలు, కుల ధ్రువీకరణ పత్రం ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.100 స్టాంప్ పేపర్‌పై కవర్ లెటర్‌తో పాటు రైతు సంపర్క్ కేంద్ర అధిపతికి పంపాలన్నారు. మరిన్ని వివరాల కోసం కమలాపూర్, మరియమ్మనహళ్లి, హొస్పేటలోని సమీప రైతు సంప్రదింపు కేంద్రాలలో విచారించి మైక్రో ఇరిగేషన్ యూనిట్లను పొందవచ్చన్నారు.

హోసూరు జోన్

రూ.1.31 కోట్లతో ఆలయాల జీర్ణోద్ధరణ



భూమిపూజ చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్ తదితరులు

హోసూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని వెయ్యి సంవత్సరాల పురాతనమైన అరుల్మిగు ఐరతీశ్వరర్, అళగేశ్వరర్ ఆలయాలను హిందూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ.1.31కోట్లతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. ముఖ్యమంత్రి స్టాలిన్ చెన్నైలోని సచివాలయం నుంచి వీడియా కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఇదే సందర్భంగా గ్రామీణాభివృద్ధి, పంచాయతీశాఖ తరఫున అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంతెనను ఆయన ప్రారంభించారు. కాగా కృష్ణగిరి కలెక్టర్ దినేశ్‌కుమార్ శూలగిరి తాలూకా అత్తిముగం గ్రామంలోని అరుల్మిగు ఇరవాదేశ్వరర్, అళగేశ్వరర్ ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆలయాల జీర్ణోద్ధరణతోపాటు పవిత్ర మందిరాలు, చెరువులను పునరుద్ధరించే ప్రక్రియ రాష్ట్రప్రభుత్వం చేపట్టిందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించదలడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రాముయేల్, ఈఓ చిన్నస్వామి, మాజీ ఎమ్మెల్యే మురుగన్, శ్రీనివాసన్, భాగ్యరాజ్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో 'మీతో స్టాలిన్ ప్రాజెక్టు' శిబిరాలు



ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా మీతో స్టాలిన్ ప్రాజెక్టు శిబిరాలు ఈనెల 23న శనివారం ఉంటాయని డీఎంకే పశ్చిమ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్యే ప్రకాశ్ తెలిపారు. తళి పంచాయతీ యూనియన్ తళి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో ఉదయం 9 గంటలకు, హోసూరు పంచాయతీ యూనియన్ - బాగలూరు ప్రభుత్వ బాలికల హయ్యర్ సెకండరీస్కూల్‌లో 11 గంటలకు, వేపనపల్లి పంచాయతీ యూనియన్-బీమండపల్లి, కుప్పచిపరై ప్రభుత్వ యూనియన్ మి డిల్ స్కూల్‌లో ఉదయం 11.30 గంటలకు, కెలమంగలం పంచాయతీ యూనియన్ - తొట్టతిమ్మనల్లి గ్రామ లైబ్రరీ భవనం, ముత్తంపట్టిలో మధ్యాహ్నం 12.30 గంటలకు శిబిరాలు ఉంటాయని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

గ్రామాలకు రాత్రి బస్సు సర్వీసులు పెంచాలి

హోసూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హోసూరులోని గ్రామాలకు రాత్రి బస్సు సర్వీసులు పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. హోసూరులోని సిప్‌కాట్ 1, 2లలో 3వేలకంటే ఎక్కువ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీలలో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాదిమంది కార్మికులు పనిచేస్తున్నారు. రైతుబజార్, మార్కెట్‌తోపాటు ఫ్యాక్టరీలనుంచి తిరిగి గ్రామాలకు వెళ్లేందుకు తగినన్ని బస్సు సర్వీసులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్టు పలువురు వాపోతున్నారు. ఇందుకు సంబంధించి సోషల్‌మీడియాలో కూడా పోస్టింగ్‌లు వస్తున్నాయి. ఈమేరకు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

అధ్యాపకులను నియమించండి

రాయచూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని విద్యార్థినులు ధర్నాకు దిగారు. కళాశాలలు పునఃప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేకపోవడం దారుణమన్నారు. శుక్రవారం కళాశాల ఎదురుగా ధర్నాకు దిగి ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందించారు. కేవలం ఇద్దరు మాత్రమే అధ్యాపకులు విధులు నిర్వహిస్తుండగా మిగితా సబ్జెక్టుల బోధన కోసం అతిథి అధ్యాపకుల నియామకం చేపట్టాలని అనేక సార్లు కోరుతున్నా ఉన్నతాధికారుల నుంచి స్పందన లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం అధ్యాపకులను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

తీరప్రాంత గ్రామాల్లో సంచార వైద్య సేవలు



ప్రజలకు వైద్యసేవలందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు

రాయచూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది ఉధృత ప్రవాహంతో ప్రమాదం బారిన పడుతున్న గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శుక్రవారం సంచార వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. బసవసాగర జలాశయం నుంచి 2.60 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో జిల్లా సరిహద్దులో ప్రవహిస్తున్న కృష్ణానది ఉధృత రూపం దాల్చింది. దీంతో ఇప్పటికే శీలహళ్ళి వంతెన పూర్తిగా నీట మునిగిపోగా వంతెన దాటి నది ఆవల తీరంలో ఉన్న గ్రామాలు కరదగడ్డ, హంచినాళ తదితర గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీసే పరిస్థితి తలెత్తింది. దీంతో పాటు జిల్లాలోని లంక గ్రామాలుగా ఉన్న నడిగడ్డ గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోవడంతో అధికారులు వారికి అన్ని రకాల వైద్యసేవలు ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు.